క్లుప్తంగా

జనన మరణ విభాగంలో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలోని జనన మరణ విభాగంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఎస్‌వో ఎం.పాదాలు, డేటా ఆపరేటర్ రాజబాబు మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో మున్సిపాలిటీలో సాగుతున్న జనన మరణాల నమోదు ప్రక్రియపై ఫిర్యాదులు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసినట్లుగా తెలుస్తుంది. తమ తనిఖీల్లో రికార్డులు సక్రమంగానే ఉన్నాయని, అక్కడక్కడా నెలకొన్న చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకోవాలని సూచించినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు జనన వివరాల సమాచారం ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంపై నివేదికను డీఎంఅండ్‌హెచ్‌వోకు అందజేస్తామన్నారు.

పరదేశమ్మ వీధిలో భారీ అన్నదానం



పరదేశమ్మ వీధిలో నిర్వహిస్తున్న భారీ అన్నదానం

తాళ్లరేవు: గణపతి నవరాత్ర వేడుకల్లో భాగంగా తాళ్లరేవు పరదేశమ్మ వీధిలో మంగళవారం భారీ అన్నదానం చేశారు. మండల కేంద్రమైన తాళ్లరేవుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. గత 12 ఏళ్లుగా గణపతి నవరాత్ర ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీసాల పట్టివేత



తనిఖీల్లో పట్టుబడిన అక్రమ మద్యంతో పాటు సీజ్ చేసిన ఆటోతో నిందితుడు

తాళ్లరేవు: తాళ్లరేవు మండలం ఇంజరంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ సీఐ బి.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి చేసిన తనిఖీల్లో యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఆటోలో తరలిస్తున్న 352 మద్యం సీసాలను పట్టుకున్నారు. నీలపల్లి పంచాయతీ జార్జిపేటకు చెందిన మందపల్లి ఏసును అదుపులోకి తీసుకున్నారు. ఏసుతో పాటు మద్యం సరఫరాకు కారకుడైన పలివెల సుబ్రహ్మణ్యంలపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న మద్యం, ఆటోను సీజ్ చేసినట్లు తాళ్లరేవు ఎస్‌ఈబీ సీఐ జేవీ భవాని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 105(గ్రూప్–బీ, టెక్నికల్, నాన్ గెజిటెడ్) నర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరాములు మంగళవారం తెలిపారు. పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాం నివాసితులై ఉండి సంబంధిత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు వచ్చే నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా ఆరోగ్య సర్వే



ఎస్.కొత్తపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే విస్తృతంగా జరుగుతుంది. ఎస్.కొత్తపల్లిలో వైద్యాధికారులు ఢిల్లీ ప్రసాద్, లోవ సుధల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 30న జరిగే ఆరోగ్య క్యాంపునకు అందరూ హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అంగాని అనంతలక్ష్మి, బొడ్డు నాగేశ్వరరావు, కుంచే చిన్ని, కొంకి బాలకృష్ణ, అంగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కిచెన్ గార్డెనింగ్‌పై సదస్సు

యానాం: పుదుచ్చేరి వ్యవసాయశాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ యానాం ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ బుధవారం రైతులకు కూరగాయల సాగు, కిచెన్ గార్డెనింగ్‌పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు వ్యవసాయ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైతులకు విత్తనాల కిట్లను అందజేస్తారన్నారు.

రక్షణ కవచంగా ఆయుష్మాన్ భారత్

- నిరుపేదలకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు
- రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్యం



ఆయుష్మాన్ హెల్త్‌కార్డు



ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న వైద్య బృందం

అల్లవరం: నిరుపేదలకు ఆయుష్మాన్ భారత్ పథకం భరోసా కల్పిస్తోంది. ఎలాంటి ఆరోగ్య సమస్య ఎదురైనా కార్పొరేట్ స్థాయిలో రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఏడాదికి రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్నవారికి ఉచిత వైద్యం అందిస్తున్నారు. గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో వలంటీర్లు, ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలు రోగుల ఆరోగ్య సమస్యలపై స్పందించి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉండే ఆరోగ్య మిత్రకు వివరాలు అందించి వైద్య సేవలు అందిస్తారు. రోగుల అత్యవసర పరిస్థితికి అనుగుణంగా 108 వాహనంలో నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తమై ఉంటారు.

వారానికోసారి ప్రత్యేక వైద్య శిబిరాలు

ఆయుష్మాన్ భారత్ పథకంలో హెల్త్ కార్డులు పొందిన లబ్ధిదారులకు సంవత్సర కాలంలో రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్యాన్ని అందిస్తారు. కుటుంబంలోని వారంతా హెల్త్ కార్డులు పొందితే ఒక్కొక్కరికి రూ.5 లక్షల వరకూ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందుతుంది. ఆయుష్మాన్ భారత్ పథకంలో ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో వారానికి ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో గైనిక్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, కళ్లు, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జరీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. రెండో దఫాగా డిసెంబర్ 31 వరకూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఎక్కువ మందికి ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూర్చేలా వైద్య శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు వైద్య సేవలు అందిస్తున్నారు. మరోవైపు సెప్టెంబర్ 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించడానికి ఇంటింటికి సర్వే శరవేగంగా సాగుతుంది.

అక్టోబర్ 2 వరకూ ప్రత్యేక శిబిరాలు



ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా అల్లవరం సీహెచ్‌సీలో వారానికోసారి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. అక్టోబర్ 2 వరకూ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయి. రోగులకు మెరుగైన వైద్యం అవసరమైతే ఆయుష్మాన్ భారత్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తున్నాం.

– డాక్టర్ మౌనిక, సూపరింటెండెంట్, అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు పెయింటింగ్‌ను అందిస్తున్న సంఘ నాయకులు

అమలాపురం రూరల్: ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను ఎంటీఎస్ అమలు చేసి క్రమబద్ధీకరించాలని కోరుతూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు ఎస్‌ఎస్‌ఏ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయనను కలిసి సంఘ నాయకులు పెయింటింగ్‌ను బహూకరించారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, పార్ట్ టైం అనే పదాన్ని తొలగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రవీణ్ ప్రకాష్‌ను కలిసినవారిలో శ్రీరంగపట్నం జెడ్పీటీసీ సభ్యుడు కన్నాబత్తుల రామ్మోమన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జల్లూరి నరసింహారావు, బొంతు వెంకట సత్యప్రసాద్ తదితరులున్నారు.

కులగణన బిల్లు ఆమోదంపై కుడుపూడి హర్షం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాళ్లరేవు: బీసీ కులగణన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పత్తిగొందిలోని తన స్వగృహంలో ముమ్మిడివరం నియోజవకర్గ బీసీ నాయకుల సమావేశంలో శివన్నారాయణ మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత బీసీ కులగణనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అసెంబ్లీ ఆమోదం తెలపడం హర్షించదగిన విషయమన్నారు. అందరికీ సామాజిక న్యాయం చేయాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు బీసీ సామాజిక వర్గానికి అన్ని రంగాలలో అధిక ప్రాధాన్యమిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఇంజరం, మర్లపాలెం సర్పంచ్‌లు ముద్దన వెంకట శివరామప్రసాద్, విత్తనాల నాగబ్రహ్మేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు రత్స ముత్యాలు, గుత్తుల శ్రీనివాస్, కాదా శ్రీనివాస్, రేకాడి నరసింహమూర్తి, నాయకులు అంకాడి అంజిబాబు, రెడ్డి సతీష్, చిట్టూరి చలపతి, పంపన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఐజీగా బ్రిజేంద్రకుమార్ యాదవ్

యానాం: పుదుచ్చేరి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీఐజీ)గా బ్రిజేంద్రకుమార్ యాదవ్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించినట్లు పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆర్ఏఓ కార్యాలయానికి సమాచారం అందించామన్నారు. ఏజీఎంయూ–-2010 కేడర్‌కు చెందిన బ్రిజేంద్రకుమార్ ప్రస్తుతం సీనియర్ సూపరింటెండెంట్ పోలీస్(సీఅండ్ఐ)లో విధులు నిర్వహిస్తున్నారు.

ఈడబ్ల్యూఎస్‌పై సభ అర్థరహితం

యానాం: ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఆర్థిక వెనకబడిన వర్గాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు నిర్వహించిన సభ అర్థరహితమని మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్‌లపై ప్రధాని మోదీ ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో చట్టం చేశారని దాన్ని అందరూ గౌరవించాలన్నారు.

మాజీ సైనికులకు ఫెస్టివల్ గ్రాంట్

యానాం: మాజీ సైనికులకు 2022–23 సంవత్సరానికి ఫెస్టివల్ గ్రాంట్ ఇచ్చేందుకు ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే ఫండ్ కమిటీ ఆమోదించిందని పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెస్టివల్ గ్రాంటును లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లలో జమ చేస్తామన్నారు. కావున లబ్ధిదారులు తమ ఐడీ కార్డు, బ్యాంకు అకౌంట్, లైఫ్ సర్టిఫికెట్‌ల వివరాలను వచ్చే నెల 20లోగా యానాం ఆర్ఏఓ కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు 0413–2253107 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నవోదయ విద్యార్థికి పురస్కారం



విద్యార్థి యశ్వంత్ కృష్ణకు మెమెంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాశరావు

యానాం: ఫ్యూచర్ సాల్వ్ హ్యాక్‌థాన్‌లో పాల్గొన్న యానాం జవహర్ నవోదయ 8వ తరగతి విద్యార్థి యశ్వంత్ కృష్ణకు పురస్కారం లభించిందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకూ హైదరాబాద్‌లో నిర్వహించిన ఫ్యూచర్ సాల్వ్ హ్యాక్‌థాన్ సదస్సులో యశ్వంత్ కృష్ణ బృందం అడవుల పరిరక్షణపై ప్రదర్శించిన ప్రాజెక్టుకు ద్వితీయ పురస్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి యశ్వంత్ కృష్ణతో పాటు ప్రాజెక్టుకు గైడ్ చేసిన కోఆర్డినేటర్ జయప్రకాష్, సైన్స్ అధ్యాపకులను ఆయన అభినందించారు.

నవోదయలో నా మట్టి–నా దేశం

యానాం: స్థానిక నవోదయ విద్యాలయలో మంగళవారం నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రకాశరావు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఎంతోమంది సమరయోధుల్ని గౌరవించాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ జరగకుండా అడ్డుకుంటామని జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు అన్నారు. స్థానిక జై భీమ్ కాంప్లెక్స్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన జిల్లా దళిత ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో దళితులను విడదీసి పాలించే యోచన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధమన్నారు. సమావేశంలో ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30 నుంచి ఆరోగ్య సురక్ష క్యాంపులు

ఐ.పోలవరం: మండలంలోని ఎదుర్లంక, పశువుల్లంక, మురమళ్ల, జి.వేమవరం, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, పాతయింజరం తదితర ప్రాంతాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 31 వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో బుజ్జిరాజు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో పరిశుభ్రతే ప్రధానంగా కార్యదర్శులంతా పనిచేయాలని డీఎల్‌పీవో పి.బుజ్జిరాజు అన్నారు. మండలం పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ కె.ఎస్.గౌరీకుమారి ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న స్వచ్ఛతా హీ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామాలను పరిశుభ్రం చేయించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు దాసరి కృష్ణాజీ, వీవీవీ సత్యనారాయణ, తిక్కిరెడ్డి రామకృష్ణ, వర్రే నాగేంద్ర, కె.రమాదేవి, పరమట సాయిబాబు, పెట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



వేలం పాటలో దక్కించుకున్న గణపతి లడ్డూతో వీర్ని శేషు



రవీంద్రనగర్‌లో గణనాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్

ఉప్పలగుప్తం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని గొల్లవిల్లి గ్రామంలో వేంచేసి ఉన్న సిద్ధి వినాయక స్వామి వారి ఆలయం వద్ద మంగళవారం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని 1600 యాపిల్ పండ్లతో ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం లడ్డూ వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన నాగిరెడ్డి మణికంఠ అనే భక్తుడు రూ.27,500లకు కైవసం చేసుకున్నాడు. దాతలు మద్దింశెట్టి సీతారామస్వామి, వీర్రాజు, శివయ్యల ఆర్థిక సహకారంతో అన్నసమారాధన జరిపారు.

గణనాథునికి ఎమ్మెల్యే అశోక్ పూజలు

యానాం: గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాలను మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చారిత్రక పిల్లారాయ ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గిరియాంపేట, సీతారామనగర్, జైలువీధి, రవీంద్రనగర్ తదితర గ్రామాల్లో గణనాథులను దర్శించి పూజలు చేశారు.

గణపతి మహా లడ్డూకు వేలం

అమలాపురం టౌన్: స్థానిక ఆది గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో ముమ్మిడివరం గేటు సెంటరులో గణపతి విగ్రహం వద్ద ఉంచిన మహా లడ్డూకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. బులియన్ అసోసియేషన్‌కు చెందిన వ్యాపారి వీర్ని శేషు ఆ లడ్డూను రూ.39 వేలకు పాడుకుని సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శి రాయుడు నాని, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి షరాబుల పందిరిలో జరిగిన భారీ అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బాలగణపతి 55వ వార్షికోత్సవం

యానాం: పట్టణ పరిధిలోని తోటవారివీధిలో బాలగణపతి ఆలయంలో నవరాత్ర మహోత్సవాన్ని పురస్కరించుకుని 55వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 27 వరకూ కొనసాగుతాయని బాలగణపతి సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 30న భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



గొల్లవిల్లిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ప్రత్యేక అలంకరణలో యానాం బాలగణపతి

రక్తదాతలై ప్రాణాలు నిలబెట్టాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: సమాజంలో ప్రతిఒక్కరూ రక్తదాతలై ప్రాణాలు నిలబెట్టాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. కోనసీమ రక్త నిధి 6వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో స్థానిక బుద్దాల బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని కమిషనర్ అయ్యప్పనాయుడు ప్రారంభించి ప్రసంగించారు. శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యుడు వెన్న శ్రీహరిరాయలు, లింగోలు పండు, వీరు గట్టిం, బండారు సురేష్, చీకట్ల కిరణ్, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

42 మంది రక్తదానం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల, ఆయుర్వేద ఫిజియోథెరపీ ఆస్పత్రికి చెందిన 42 మంది విద్యార్థులు, సిబ్బంది కోనసీమలోని మూడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంగళవారం రక్తదానం చేశారు. అమలాపురం, కాకినాడ, కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, గర్భిణులు, తలసేమియా రోగుల కోసం రక్తదానం చేశారని యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

పింఛన్ రూ.10 వేలకు పెంచాలి



సమావేశంలో పాల్గొన్న వీఆర్వోల రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు

అమలాపురం రూరల్: పదవీ విరమణ చేసిన వీఆర్వోలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.4 వేలు పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని వీఆర్వోల రాష్ట్ర అధ్యక్షుడు డీవీ సుబ్బారావు కోరారు. అమలాపురంలో మంగళవారం జరిగిన జిల్లా వీర్వోల సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 1వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే సమావేశానికి అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ గ్రామాధికారుల సంఘం నాయకుడు గనిశెట్టి సుబ్బారావు, రామ్ గోపాలం, కల్వకొలను వెంకటరమణ, అరవ పూర్ణచంద్రరావు, జిల్లా వీఆర్వో సంఘ అధ్యక్షుడు సాధనాల ఏలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులకు రూ.20 లక్షలు మంజూరు



ఎస్.రామేశ్వరం మొగలో ఇసుక మేటలను తొలగిస్తున్న ప్రొక్లెయిన్

అల్లవరం: అమలాపురం నియోజకవర్గ పరిధిలోని సుమారు 35 వేల ఎకరాలను ముంపు బారి నుంచి కాపాడేందుకు కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం మొగ పూడికతీత పనులకు సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం తెలిపారు. గోదావరి డెల్టాలోని ప్రధాన డ్రెయిన్లు వాసాలతిప్ప, పంచనీటి కాలువ, లోయర్ కౌశిక డ్రెయిన్ల నుంచి ముంపు నీరు ఎస్.రామేశ్వరం మొగ ద్వారా సముద్రంలోకి దిగుతుందని, అయితే తుఫాన్లు, భారీ వర్షాలతో పాటు సముద్రంలోని భారీ అలలకు ఇసుక మేటలు వేసి మొగ మూసుకుపోతుందన్నారు. దీనివల్ల అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో 35వేల ఎకరాల ఆయకట్టు ముంపుబారిన పడుతుందన్నారు. అందుకే డ్రెయిన్ అధికారులు పూడిక తీత పనులు చేపట్టారని, మరో పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు.

అత్యంత పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 అత్యంత పారదర్శకంగా జరిగిందని ఆర్డీవో ఎస్ఎస్‌బీ వసంతరాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆర్డీవో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియకు సంబంధించి అన్ని అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 234 పోలింగ్ కేంద్రాల్లో మొత్తంగా 2,06,403 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో పురుషులు 1,03,234 మంది, మహిళలు 1,03,169 మంది ఉన్నారని చెప్పారు. బండారులంకలో మూడు పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పులు చేపట్టినట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో నల్లమిల్లి, అమలాపురం మున్సిపాలిటీలో రెండు, వన్నె చింతలపూడి, ఎస్.కొత్తపల్లిలో ఐదు పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదించామని చెప్పారు. అల్లవరం మండలం ఎస్.పల్లిపాలెంలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. క్లైయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసేందుకు అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకూ సమయం ఉంటుందన్నారు. అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 26 తేదీని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పరమట శ్రీపల్లవి, ప్రసాద్, రాజకీయ పార్టీల నాయకులు బడుగు సత్యనారాయణ, కారెం వెంకటేశ్వరరావు, దూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు పలువురి పరామర్శ

తాళ్లరేవు: అనారోగ్యంతో అస్వస్థతకు గురై వారం రోజుల పాటు కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ రాయుడు సునీత భర్త గంగాధర్‌ను మంగళవారం పలువురు పరామర్శించారు. ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ మండల లీగల్ సెల్ అధ్యక్షుడు యడ్ల కుటుంబరావు తదితరులు గంగాధర్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పీడబ్ల్యూడీ తాత్కాలిక సిబ్బంది నిరసన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ) శాఖలో గత కొన్నేళ్లుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తాత్కాలిక ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో అసెంబ్లీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015లో 100 మందిని పీడబ్ల్యూడీలో తాత్కాలిక సిబ్బందిగా నియమించారని, అయితే ఇప్పటివరకూ తమకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, సేతుపతి, మనివన్నన్ పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న టీవీ సీరియల్ బృందం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామిని స్వాతి చినుకులు టీవీ సీరియల్ బృందం మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురమళ్ల సర్పంచ్ కాశే రాజుబాబు, ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజులు సీరియల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, బృందానికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సత్కరించారు.